క్లుప్తంగా

జాబ్‌మేళాలో 16మంది ఎంపిక



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. అమర్‌రాజా, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో 51 మంది అభ్యర్థులు హాజరు కాగా 16 మంది ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధురి, వైస్ ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, కో ఆర్డినేటర్ అల్తాఫ్, నాన్ టెక్నికల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు శ్రీనివాసులు, సాయితేజ, స్కిల్ ట్రైనర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి పత్తికొండలో ధార్మిక ప్రవచనాలు

పత్తికొండ(తుగ్గలి) : పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజుల పాటు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. మహాభారతం, భగవద్గీతపై ప్రముఖ నాటకరంగ కళాకారుడు పాయసం పెద్ద రంగారెడ్డిచే ప్రతి రోజు సాయంత్రం 6 నుంచి 8గంటల వరకు ప్రవచనాలు, స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.చివరి రోజు గోపూజ, కుంకు మార్చన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ మేరకు సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అమరావతి శ్రీనివాస్, వీహెచ్‌పీ పత్తికొండ ప్రఖండ అధ్య క్షుడు వీరరాజు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ రామలింగయ్య, కళాకారుడు పెద్ద రంగారెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు కోదండరాం పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించండి

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతగా అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ కోరారు. వెల్దుర్తి బాలుర హైస్కూల్, గురుకుల పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ గతంలో కంటే భోజనం నాణ్యత తగ్గిందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు, రైతు సంఘం మండల కార్యదర్శి రాజు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సురేంద్రయాదవ్, సహనంద్ ఉన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

హొళగుంద: ఆదోనిలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్‌స్థాయి క్రీడా పోటీల్లో హొళగుంద విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-14 విభాగం కబడ్డీ పోటీల్లో బాలికలు విన్నర్‌గా, బాలురలు రన్నర్‌గా నిలిచారని హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ సోమవారం తెలిపారు. క్రీడాకారులను పీఎంసీ చైర్మన్ ద్వారకనాథ్, ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థిని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులు

వెల్దుర్తి(కృష్ణగిరి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసులు వార్డెన్ శైలజకు సూచించారు. వెల్దుర్తిలోని బీసీ బాలికల హాస్టల్‌ను సోమవారం సాయంత్రం ఆయన పరిశీలించి విద్యార్థినుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. హాస్టల్‌లో అందుతున్న సౌకర్యాల గురించి బాలికలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సమ్మెటివ్ పరీక్షలో వచ్చిన మార్కులపై ఆరా తీశారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులు పబ్లిక్ పరీక్షల్లో అనుసరించాల్సిన పద్ధతులపై పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఆశించిన ఫలితాలు సాధిస్తారని చెప్పారు. అనంతరం డైనింగ్ హాలు, గదులను పరిశీలించారు. బాలికల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వార్డెన్‌కు సూచించారు.

చామంతి సాగు..లాభాలు బాగు

- పూల సాగులో అధిక దిగుబడి సాధిస్తున్న రైతు
- కేజీ 80 నుంచి వంద వరకు పలుకుతున్న ధర
- మూడు రకాల పూలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- కోల్‌కతా నుంచి నారు తెచ్చి, సాగు

ఏటా వేరుశనగ, శనగ, జొన్న తదితర పంటలు సాగు చేసినా లాభాలు రాకపోగా నష్టాలు వస్తుండటంతో ఎలాగైనా పంట మార్చి లాభాల బాట పట్టాలనుకొని ఓ రైతు చామంతి సాగుకు శ్రీకారం చుట్టాడు. అనుకున్నదే తడవుగా కోల్‌కతా నుంచి మూడు రకాల చామంతి నారు తెప్పించి సాగు చేశాడు. ప్రస్తుతం దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, అనుకున్న ధర లభిస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. మిగిలిన రైతులు కూడా పంట మార్పిడితో ఆదాయం తెచ్చి పెట్టే పంటలు సాగు చేస్తే వ్యవసాయం సాఫీగా సాగుతుంది.





హులేబీడు గ్రామంలో సాగు చేసిన చామంతి పూలు



ఆలూరు రూరల్: వ్యవసాయంలో తరచూ నష్టాలు రావడంతో ఆ రైతు చామంతి పూల సాగుపై దృష్టి సారించాడు. ఆలూరు మండలంలోని మరకట్టు గ్రామానికి చెందిన రైతు బసవరాజు.తనకు ఉన్న 5 ఎకరాల పొలంలో గతంలో పత్తి,వేరుశనగ తదితర పంటలు వేశాడు. దిగుబడిలో నష్టం రావడంతో ఏటా 5 ఎకరాల్లో చామంతి, బంతి పూలు బోరు కింద సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నాడు. రోజు రెండు క్వింటాళ్ల పూల దిగుబడి వస్తోంది. మార్కెట్లో ఈ పూలు కిలో రూ.80 ధర ఉంది. చామంతి దిగుబడిని బెంగళూరు,హైదరాబాద్, విజయవాడ, కర్నూలు, బళ్లారి, ఆదోని పట్టణాలకు ఎగుమతి చేస్తున్నాడు.

కలకత్తా నుంచి నారు తెచ్చి..

కొత్త రకం వంగడాలు, మూడు వెరైటీలతో కోల్‌కతా నుంచి చామంతి,బంతి పూల నారు మొక్కలు తెచ్చి తన పొలంలో నాటుకున్నాడు. ఒక మొక్క రూ. 3 వెచ్చించి ఎకరా నారుకు దాదాపు రూ.60 వేలు ఖర్చ చేశాడు. ఎకరాకు 20 వేల మొక్కలు నాటాడు. వీటికి వేస్తు కంపోస్టు ,సేంద్రీయ ఎరువులతో పాటు తెగులు నివారణ కోసం రసాయనిక మందులు వాడుతున్నాడు. మూడు నెలల పంట కావడంతో సెప్టెంబర్ నెలాఖరులో పంట వేశాడు. 45 రోజులకు ఒక కాపు వస్తోంది. ప్రస్తుతం పంట దిగుబడి వచ్చింది. ఉష్ణోగ్రత 25 డిగ్రీల లోపు ఉంటేనే చామంతి మొక్క బతుకుతుంది. గత రెండు నెలల నుంచి క్వింటానికి రూ.8 వేల మాదిరి విక్రయించాడు. ఎకరాలో సాగుకు రూ.70 వేల వరకు పెట్టుబడి పె ట్టాడు. సీజన్లో కాపు వస్తే ఇంకా ఎక్కువ రేటు వచ్చేదని. రెండు నెలల క్రితం కొద్దిపాటి వర్షాల కారణంగా కొంత పంట నష్ట పోవాల్సి వచింది. ప్రస్తుతం ఈ మూడు రకాల చామంతి పూలను బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, కర్నూలు, బళ్లారి, ఆదోని తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాడు.రోజు క్వింటా రూ.8 వేల వరకు లభిస్తుంది.

దిగుబడి బాగుంది



గతంలో ప్రతి ఏడాది వివిధ పంటలు సాగు చేసి నష్టాలు చవి చూశాను. చామంతి పూల సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. కోల్‌కతా నుంచి మూడు రకాల చామంతి నారు ఒక మొక్క రూ.3 చొప్పున కొనుగోలు చేసి ఎకరాకు 20 వేల మొక్కలు నాటాను. పంట బాగుంది. ఈ ఏడాది మరో రెండు ఎకరాల్లో బంతి పూలు సాగు చేశాను. దిగుబడి బాగా వస్తోంది. ధర కూడా బాగుంది.

– బసవరాజ్, రైతు, మరకట్టు

ఇరుముడితో దుర్గమ్మ సన్నిధికి



ఇరుముడితో విజయవాడకు బయలుదేరుతున్న భవానీ మాలధారులు

హాలహర్వి: మండలంలోని అర్థగేరి, హాలహర్వి గ్రామాలకు చెందిన భవానీ మాలధారులు సోమవారం ఇరుముడి స్వీకరించి విజయవాడకు బయలుదేరి వెళ్లారు. స్థానిక దుర్గమ్మ గుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి కట్టుకుని వారిని బంధువులు, స్నేహితులు ఊరేగింపుగా వీడ్కోలు పలికారు. మాలధారులు, వారి కుటుంబ సభ్యుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాంది.

నేటి నుంచి కబడ్డీ పోటీలు

దేవనకొండ: క్రిస్మస్ పండగను పురస్కరించుకుని మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు ఏబీఎం సంఘ పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాలుగో బహుమతి రూ.7 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఆసక్తి గల జట్లు ఈనెల 24వ తేదీన జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9959200387 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంగళదహాళ్ స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలి

హొళగుంద: మండలంలోని ఇంగళదహాళ్ జెడ్పీ ఉన్నత పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్‌గానే కొనసాగించాలని ఇంగళదహాళ్, పెద్దగోనెహాళ్, మద్దిలింగదహళ్లీ (ఎం.డీ హళ్లి) గ్రామాల పెద్దలు సోమవారం హొళగుందలో తహసీల్దారు సతీష్, ఎంపీడీఓ విజయలలితను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంపీటీసీ మల్లికార్జున, ఎండీ హళ్లీ సర్పంచు సుధాకర్, ఆయా గ్రామాల పెద్దలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రన్న, వీరనాగప్ప, ఖాదర్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మల్లికార్జున తదితరులు అధికారులను కలిసి మాట్లాడారు. 1964 నుంచి పాఠశాల కొనసాగుతోందని, 7.65 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండి టీచర్లు, బాయ్స్ హాస్టల్ తదితర అన్ని సదుపాయాలు కలిగి ఉందన్నారు. గ్రామం చుట్టూ పక్కల ఉన్న 9 పాఠశాలలకు ఈ హై స్కూల్ స్కూల్ కాంప్లెక్స్‌గా ఉందని చెప్పారు. ఇలాంటి పాఠశాలను రీ ఆర్గనైజేషన్ పేరుతో విద్యా శాఖాధికారులు స్కూల్ కాంప్లెక్స్ నుంచి తొలగించి హైస్కూల్‌తో పాటు 9 పాఠశాలలను హెబ్బటం స్కూల్ కాంప్లెక్స్‌లో కలిపారన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఇంగళదహాళ్ స్కూల్ కాంప్లెక్స్‌ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.



హొళగుందలో తహసీల్దారు, ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కేటాయించిన స్కూల్ కాంప్లెక్స్‌ను అలాగే కొనసాగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి, రాజు, గాదిలింగ, జిలాన్ తదితరులు ఎంఈఓ-1, 2 సత్యనారాయణ, జగన్నాథంలకు వినతి పత్రం అందించి కోరారు. గ్రామంలో అన్ని రకాల సదుపాయాలు, వసతులు, రోడ్డు, రవాణ సౌకర్యం ఉందని, ఎల్లార్తి స్కూల్ కాంప్లెక్స్‌గా మారితే పాఠశాల అభివృద్ధి చెంది విద్యాభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్లార్తి పాఠశాలకు కేటాయించిన స్కూల్ కాంప్లెక్స్‌ను ఉప సంహరించకోకుండా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ డీలర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పత్తికొండ(తుగ్గలి) : డివిజన్ పరిధిలో 44 డీలర్ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆర్డీవో భరత్ నాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ కారణాలతో 33, కొత్తగా ఏర్పడిన 11 చౌకదుకాణాలకు డీలర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఓసీకి 28, బీసీ 7, ఎస్సీ 7, ఎస్టీకి 2 చొప్పున కేటాయించినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియెట్ పాసై ఉండి 18-40ఏళ్ల మధ్య యువతీ, యువకులు అర్హులన్నారు. ఈనెల 30వ తేదీ సాయంత్రం 5గంటల లోపు నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పత్తికొండ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తు, ఇతర పూర్తి వివరాలకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

హాలహర్వి: మండలంలో హేతుబద్ధీకరణ ద్వారా చౌకదుకాణాల డీలర్ పోస్టులకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసినట్లు తహసీల్దార్ నజ్మాబాను తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశమై మాట్లాడారు. మండలంలోని బల్లూరు, సిద్ధాపురం, సిరిగాపురం, బేవినహాళ్, చాకిబండ గ్రామాల్లో డీలర్ పోస్టులకు ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఈనెల 23న నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు. డీలర్ల ఎంపిక రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపరిచిన నిబంధనలకు లోబడి తమ అర్జీలను పత్తికొండ ఆర్డీఓకుకు రిజిస్టర్ పోస్టు ద్వారా ఈనెల 30వ తేదీలోపు అందించాలని చెప్పారు. అర్జీ నమూనా కావాల్సిన వారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పొందవచ్చన్నారు. జనవరి 5న రాత పరీక్ష, 6న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న తహసీల్దార్ నజ్మాబాను

మద్దికెర : మండలంలోని బురుజుల గ్రామంలో ఖాళీగానున్న చౌకదుకాణం డీలర్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ హుసేన్ సాహెబ్ సోమవారం తెలిపారు. స్థానికులై ఉండి, అర్హతలున్న వారికి జనవరి 6న పత్తికొండలోని జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహించి అత్యధిక మార్కులు సాధించిన వారికి షాపు కేటాయిస్తామని చెప్పారు.

అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలి

పత్తికొండ(తుగ్గలి) : భారతత రత్న బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మంత్రి వాఖ్యలు నిరసిస్తూ పార్టీ మండల కమిటీ సభ్యుడు దస్తగిరి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలియజేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.పార్టీ మండల కమిటీ సభ్యులు గంగన్న, రామాంజనేయులు, అనుబంధ సంఘాల నాయకులు ప్రభాకర్, ఉరుకుంద, రమేష్, జయసింహ పాల్గొన్నారు.

ఆలూరు: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి సోమవారం సీనియర్ నాయకుడు తుంబళ బీడు గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మన్న ఆధ్వర్యంలో ఊరేగింపుగా వచ్చి అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ, పత్తికొండ డివిజన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గూళ్యం ఎల్లప్ప, నాయకులు మంజునాథ్, మల్లికార్జున,కరెంట్ గోవింద ,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆలూరులో అమిత్‌షాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

అనారోగ్యంతో వీఆర్వో మృతి

కృష్ణగిరి: మండలంలోని ఎరుకలచెర్వు వీఆర్వో గడ్డం విష్ణువర్ధన్‌రెడ్డి (45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఇతని స్వగ్రామం డోన్ మండలం, గుమ్మకొండ గ్రామం. కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో కర్నూలులో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్, వీఆర్వోలు రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, అయ్యన్న, నాగరత్నమ్మ, నారాయణ తదితరులు గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కుమారులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్



1916లో నిర్మించిన ఆలూరు మండలంలోని ఎం.కొట్టాల చర్చి

108 ఏళ్ల చరిత్ర..

ఆలూరు రూరల్: క్రైస్తవుల ఆరాధన కేంద్రమైన చర్చికి ఆలూరు మండలంలో ఎనలేని చరిత్ర ఉంది. ముఖ్యంగా 1916లో బ్రిటీషు వారు నిర్మించిన చర్చి నేటికీ చెక్కుచెదరకుండా ఠీవీగా దర్శనమిస్తోంది. మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలోని సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) చర్చి నిర్మించి 108 ఏళ్లు పూర్తయ్యింది. 1916లో బ్రిటీషు వారు ఈ గ్రామంలో 2,090 ఎకరాల బంజరు భూమిని పేదలకు పంచి పెట్టారు. భూమి సాగు చేసుకునేందుకు వారు అక్కడే ఇళ్లను నిర్మించుకుని జీవనం ప్రారంభించారు. ఇంటి నిర్మాణాలతో పాటు సీఎస్ఐ చర్చిని నిర్మించుకున్నారు. కొట్టాల గ్రామంలో 230 కుటుంబాలు ఉండగా ఇందులో 205 కుటుంబాలు క్రైస్తవులు కావడం విశేషం. ఇప్పటికీ లండన్ నుంచి ఈ ప్రార్థనాలయానికి నిధులు వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వచ్చిన సొమ్మును చర్చి అభివృద్ధికి ఖర్చు పెడుతున్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి

మద్దికెర : రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ఈనెల 31వ తేదీ లోపు బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి రవి సోమవారం తెలిపారు. గడువు లోగా ప్రీమియం చెల్లించి పంటల బీమా చెసుకోవాలని సూచించారు. ఒక ఎకరా కు మండల యూనిట్ కింద రూ.630 చెల్లించాలని చెప్పారు. ప్రకృతి విపత్తులతో పంట నష్టపోతే పరిహారం లభించే అవకాశముందని పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

మద్దికెర : స్థానిక బస్టాండు వద్ద నుంచి కెనరా బ్యాంకు వరకు రోడ్డు విస్తరణలో భాగంగా సోమవారం ఆక్రమణలను తొలిగించినట్లు ఈఓ శివకుమార్ తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. డ్రైనేజీ పనులు పూర్తయిన వెంటనే రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులు చేపడతామని, అయితే పనులకు అడ్డంగా ఉన్న నిర్మాణాలను తొలగించినట్లు చెప్పారు.

భూ సమస్యలకు త్వరగా పరిష్కారం

దేవనకొండ: భూ సమస్యలపై విచారణ చేపట్టి త్వరగా పరిష్కారం చూపుతామని తహసీల్దార్ లోకేశ్వర్ తెలిపారు. సోమవారం మండలంలోని వెలమకూరు, తెర్నెకల్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తెర్నెకల్ 8 దరఖాస్తులు, వెలమకూరులో 12 దరఖాస్తులు అందజేశారని చెప్పారు. వెలమకూరు సర్పంచ్ భాస్కర్, వీఆర్వో దాదావలి, రైతులు పాల్గొన్నారు.

సహజ ఉత్పత్తులతో ఆరోగ్యం

ఆస్పరి: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను వినియోగిస్తే ఆరోగ్యంగా ఉంటామని ఏపీసీఎన్‌యఫ్ సీఆర్‌పీలు రంగముని, జగధాముడు, భూలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన కూరగాయల అమ్మకాలు చేపట్టారు. మండలంలోని తంగరడోణ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ అనే రైతు 30 సెంట్ల భూమిలో వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, కొత్తిమీర, ముల్లంగి, మెంతికూర, టమాటలను పండించారు. వాటిని సీఆర్‌పీలు రైతులు, ప్రజల అవగాహన కోసం అమ్మకం చేపట్టినట్లు చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం ద్వారా సేద్యం చేసి నాణ్యమైన దిగుబడులను సాధించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు, ఉద్యోగులు వాటిని కొనుగోలు చేశారు.



ఆస్పరి తహసీల్దార్ కార్యాలయం ముందు కూరగాయలు అమ్ముతున్న ఏపీసీఎన్‌యఫ్ సీఆర్‌పీలు





హాలహర్విలోని సీఎస్ఐ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

ముస్తాబైన చర్చిలు

క్రిస్మస్ పండగకు మండలంలోని చింతకుంట, బాపురం, మెదేహాల్, గూళ్యం, బిలేహాల్ గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుత్ లైట్లతో చర్చిలను అలంకరించారు. – హాలహర్వి



టమాటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



బిల్లేకల్లు కూరగాయల మార్కెట్లో టమాట రైతులతో మాట్లాడుతున్న గిడ్డయ్య

ఆస్పరి: గిట్టుబాటు ధరలేని టమాటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని బిల్లేకల్లు కూరగాయాలు మార్కెట్‌ను సందర్శించి రైతులతో మాట్లాడి ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆస్పరి, బిల్లేకల్లు, పత్తికొండ కూరగాయలు మార్కెట్లో కిలో టమాట ధర రూ.5 లు కూడా పలకడం లేదన్నారు. దీంతో రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడమే కాకుండా కూలీలకు డబ్బులు చేతి నుంచి ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు కూరగాయల మార్కెట్లను సందర్శిస్తే ధరలు, రైతుల బాధలు తెలుస్తాయన్నారు. సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి, నాయకులు రమేష్, లక్ష్మన్న, సురేష్, రామచంద్ర, హనుమంతు ఉన్నారు.